సాక్షి సంగారెడ్డి

ఆదివారం । 17 । నవంబర్ । 2024



సుఖ దుఃఖాల సోపతి!

కనుమరుగవుతున్న తోలు డప్పులు

- ఒకప్పుడు రాజ్యమేలిన వాయిద్యం
- ఏ కార్యక్రమమైనా చాటింపు ఉండాల్సిందే
- వాటి స్థానంలో ప్లాస్టిక్ డప్పులు
- పెరిగిన డీజే మైక్ సెట్‌లు
- కళను బతికించుకోవాలంటున్న డప్పు కళాకారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

సండే స్పెషల్

డప్పు దరువు వింటే చాలు ఉద్యమాన్ని ఉరకలెత్తించే గుండె చప్పుడవుతుంది. కళాకారుల ఆట పాటలకు అడుగులవుతుంది. పండుగ పబ్బాల్లో ఉత్సాహాన్నిస్తూ చిందులేసేలా చేస్తుంది. బోనాల ఊరేగింపులో ముందు నడుస్తూ, శివసత్తుల శిగాలతో ఉగ్ర రూపాన్ని తెప్పిస్తుంది. పోతరాజులను కదం తొక్కిస్తుంది. స్వామి వారు లేదా అమ్మవారి శోభాయాత్రలో ఉత్సాహంతో మార్మోగుతుంది. శవ అంతిమ యాత్రలో విషాద నాదపు చప్పుడు వినిపిస్తూ కంట తడిపెట్టిస్తుంది. చాటింపుతో అసలు విషయాన్ని చెవిన పడేస్తుంది. పెళ్లయినా, చావైనా రేవయినా, కష్టాలొచ్చినా, కన్నీళ్లొచ్చినా, ఉత్సాహమొచ్చినా, ఉద్వేగమొచ్చినా.. ఇలా, సుఖ దుఃఖాలలో ప్రతి మనిషికి డప్పుతో అవినాభావ సంబంధాన్ని చాటి చెబుతుంది. అలాంటి డప్పు నేడు ఎక్కడా వినిపించడం లేదు. డీజేల హోరులో డప్పు చప్పుళ్లు పల్లెల్లో కనుమరుగైపోతున్న నేపథ్యంలో 'సాక్షి'ప్రత్యేక కథనం.

- వేముల బాలరాజు, మిరుదొడ్డి (దుబ్బాక)

8లో



న్యూస్‌రీల్

గ్రూప్- 3 పరీక్ష ఏర్పాట్లు పూర్తి

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సంగారెడ్డి జోన్: గ్రూప్–3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ శనివారం ఓ ప్రకటన తెలిపారు. ఆది, సోమవారాల్లో జరగనున్న గ్రూప్ –3 పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. పరీక్షకు 15,163 అభ్యర్థులు హాజరు కానుండగా... జిల్లా వ్యాప్తంగా 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు సమయ పాలన పాటించి పరీక్ష సమయానికి రెండు గంటల ముందే కేంద్రానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

శివుని కటాక్షంతో ప్రజలంతా వర్ధిల్లాలి

- టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి



దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, నీలం మధు

పటాన్‌చెరు టౌన్: పరమశివుడి కృపా కటాక్షాలతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ఆకాంక్షించారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మాజీ సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్తీక మాస దీపోత్సవానికి కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్‌తో కలసి నిర్మలారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశంలోని వివిధ నదీ జలాల నుంచి 108 కలశాలతో కలశాభిషేకం నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం నిర్మలారెడ్డి, నీలం మధు మాట్లాడుతూ...ఆధ్యాత్మికంగా కార్తీక మాసానికి దివ్యమైన విశిష్టత ఉందన్నారు. స్థానిక నాయకులు, ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ

సంగారెడ్డి టౌన్ : రాజీమార్గంతోనే కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ పేర్కొన్నారు. జిల్లా కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో శనివారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...క్రిమినల్, ఎక్సైజ్ సంబంధిత కేసులను కక్షిదారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ వారీగా కేసులను పరిష్కరించి, కక్షిదారులకు ఇబ్బంది లేకుండా చేయాలన్నారు. డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జయంతి, మూడవ అదనపు జిల్లా జడ్జి సునీత రవీంద్రారెడ్డి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం

- జిల్లా టీబీ నియంత్రణాధికారి అరుణ

సంగారెడ్డి క్రైమ్: క్షయవ్యాధి (టీబీ) పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని, దేశవ్యాప్తంగా 2025నాటికి ఆ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని జిల్లా క్షయ నియంత్రణ కో–ఆర్డినేటర్ అరుణ పేర్కొన్నారు. సంగారెడ్డిలో మోస్లా ఆధ్వర్యంలో సాయిగ్రేస్ పాఠశాల సమైక్య సభ్యులకు క్షయవ్యాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ...రెండు వారాలపాటు దగ్గుతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జిల్లాలో క్షయవ్యాధిగ్రస్తుల దత్తతకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ, కో–ఆర్డినేటర్ అరుంధతి, శ్రీమన్నారాయణ, సమైక్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టర్ సంతకంతో నకిలీ ఎన్‌ఓసీ

ఐదుగురు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ భూమి ని స్వాతంత్ర్య సమరయోధుల భూమిగా నమ్మించి కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తయారు చేసిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. కొల్లూరు సర్వే నంబర్ 191లో స్వాతంత్ర్య సమరయోధులకు కొంత భూమిని కేటాయించినట్లు చెప్పుకుంటూ వారి వారసులు వీరేశం, రాములు, సుధాకర్, సంతోష్, నాగరాజు ఒక బృందంగా ఏర్పడి ఆ భూమిని విక్రయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ భూమిని విక్రయించాలంటే దానికి ఎన్‌ఓసీ కావాలని పలువురు చెప్పగా...కొంతమంది దళారులతో కలసి కొద్దిరోజుల క్రితం ఏకంగా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఎన్‌ఓసీని తయారుచేసేశారు. వారు తయారు చేసిన నకిలీ ఎన్‌ఓసీ ఈనెల 14న తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డికి వాట్సాప్‌లో రావడంతో ఆయన వెంటనే కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు కొల్లూరు సర్వే నంబర్‌లో 191 స్వాతంత్ర్యసమరయోధులెవరికీ భూమిని కేటాయించలేదని తేల్చారు. ప్రభుత్వ భూమికి నకిలీ ఎన్‌ఓసీ తయారు చేసిన వీరేశం, రాములు, సుధాకర్, సంతోష్, నాగరాజులను శనివారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. ఓ వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విజయోత్సవాలకు శ్రీకారం

ప్రజాపాలన విజయోత్సవాలకు ప్రభుత్వం నిర్ణయం

- రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- నేడు అందోల్‌లో సభ
- మంత్రులు కొండా, దామోదర హాజరు!
- ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్రంలో ఏడాదిలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టింది. తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా బృందాలతో వివిధ కార్యక్రమాలను చేపట్టింది. ప్రతీ జిల్లాలో వరుస కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్న ప్రభుత్వం సంగారెడ్డి జిల్లా నుంచే ఈ కళాబృందాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులోభాగంగా ఆదివారం అందోల్‌లో బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతోపాటు, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. దీంతో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ శనివారం అందోల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు.

ప్రతిష్టాత్మక పథకాలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పంట రుణాలమాఫీ, ఉద్యోగాల భర్తీ, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. అలాగే రైతుభరోసా, స్కిల్ యూనివర్సిటీ, ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణాలు వంటి పథకాలపై దృష్టి పెట్టింది. ఈ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఈ విజయోత్సవాలు చేపట్టారు.

అందోల్ నుంచి కొడంగల్ వరకు..

అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే మార్గాల్లో భాగంగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రజాపాలన కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం సాంస్కృతిక శాఖకు ఆదేశించింది. తెలంగాణ సాంస్కృతిక సారథి బృందాలు అన్ని జిల్లాలు తిరగనున్నాయి. ఇందులో ఒక బృందం సంగారెడ్డి జిల్లాలోని అందోల్ నుంచి ఆదివారం ప్రారంభమవుతోంది. ఇక్కడి నుంచి మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల..ఇలా కొడంగల్ వరకు ఈ కళాయాత్ర బృందం మొత్తం 21 జిల్లాల్లో ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మరో కళాయాత్ర బృందం రంగారెడ్డి జిల్లా నుంచి భువనగిరి జిల్లా వరకు ప్రచార యాత్రలు చేపట్టింది.



జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్

పండుగలా 'ప్రజాపాలన' విజయోత్సవాలు

జోగిపేట(అందోల్): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ప్రజాపాలన' విజయోత్సవాలు పండుగలా జరుపుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సభల్లో భాగంగా మొదటి సభను జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సభకు సంబంధించిన ఏర్పాట్లను అదనపు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో కలసి పర్యవేక్షించారు. దక్షిణం వైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో వేదికను ఏర్పాటు చేసి అధికారులు, ప్రెస్ గ్యాలరీ, ప్రజలు, లబ్ధిదారులు కూర్చుండేందుకు వీలుగా గ్యాలరీల ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. సభ సందర్భంగా నాగరాజు కళాబృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీఓ పాండు, తహసీల్దారు కిరణ్, డిప్యూటీ తహసీల్దారు మధుకర్‌రెడ్డి, కమిషనర్ తిరుపతి తదితరులు ఉన్నారు.

సర్వేనా... సరిసర్లే!

- అధిక శాతం ప్రజలు సర్వేకు నిరాకరణ
- ఎన్యుమరేటర్లను నిలదీస్తోన్న ప్రజలు
- సర్వేకు పూర్తిగా సహకరించని వైనం
- నత్తనడకన సాగుతున్న సర్వే
- సర్వేపై అవగాహన లేకేనా?

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేకు ఎక్కువ శాతం ప్రజలు సహకరించకపోవడంతో సర్వే కార్యక్రమం నత్తనడకన సాగుతుంది. ఈ సర్వేపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహనను ప్రభుత్వం కల్పించకపోవడంవలనే ప్రజలు సర్వేకు వచ్చిన వారికి వివరాలు అందజేసేందుకు నిరాకరిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్లను సర్వే ఎందుకు చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తే వారు కనీసం ప్రజలకు సమాధానం కూడా ఇవ్వలేకపోవడంతో ప్రజలు వారి వివరాలు ఇచ్చేందుకు వెనుకడుగువేస్తున్నారు. అదేవిధంగా తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీ వాసులు సర్వేకు పూరిస్థాయిలో సహకరించడంలేదని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన సర్వే ఇప్పటి వరకు తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 28.5%, అమీన్‌పూర్ మున్సిపల్‌లో పరిధిలో 30%, బొల్లారం మున్సిపల్ పరిధిలో 28.82% సర్వే పూర్తయింది. ఈ ప్రాంతాలలో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. వారు సర్వేకు సహకరించడంలేదు.

మా ఆస్తి వివరాలు మీకెందుకు..?

సమగ్ర ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేకు వచ్చేవారికి ప్రజలు వ్యక్తి వివరాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. మా ఆదాయం, ఆస్తి వివరాలను మీకెందుకు ఇవ్వాలని సర్వేకు ఇచ్చిన ఎన్యుమరేటర్లును ప్రజలు నిలదీస్తున్నారు. ఎక్కువమంది ప్రజలు ఆదాయం, ఆస్తి వివరాలు ఇవ్వడంలేదు.

40% మంది సర్వేకు నిరాకరణ

నిత్యం సర్వేకు వచ్చేవారికి 40% మంది వారి వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తున్నారు. మరి కొంతమంది సర్వేకు వచ్చేవారిని బయట నుంచి బయటకే పంపిస్తున్నారు. 100 మందిలో 60మంది మాత్రమే సర్వేకు సహకరిస్తున్నా పూర్తి వివరాలను మాత్రం తెలియజేయడంలేదు.

అసలు సర్వే ఎందుకు..

ప్రభుత్వం చేపట్టిన సర్వేపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో సర్వే అంటేనే ప్రజలు అనేక అపోహలు పెట్టుకుంటున్నారు, కుల గణన కోసం, రేషన్ కార్డు కోసం ఇన్ని వివరాలు అవసరమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనికి అధికారులు ఏలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రజల ఆదాయం, ఆస్తుల కోసమే ప్రభుత్వం సర్వే చేస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు.

సర్వేకు సహకరించని గేటెడ్ కమ్యూనిటీవాసులు..

ప్రభుత్వం చేపట్టిన సర్వేకు గేటెడ్ కమ్యూనిటీవాసులు సహకరించడంలేదని పలువురు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాంతో సర్వే పూర్తిస్థాయిలో వేగవంతం చేయలేకపోతున్నామని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమందైతే వివరాలు చెప్పేదిలేదని సర్వేకు వచ్చిన వారికి తెగేసి చెబుతున్నారు.



తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

వ్యక్తిగత వివరాలు ఎందుకు



ప్రభుత్వం చేపట్టిన సర్వేలో వ్యక్తి వివరాలు అడగటం సరైనది కాదు. ఇప్పటివరకు ఇలాంటి సర్వేలు ఎవరూ చేయలేదు. మరి ప్రభుత్వం మా వివరాలను ఎందుకు సేకరిస్తుందో అర్థం కావడంలేదు.

– సంపత్, ప్రైవేట్ ఉద్యోగి, అమీన్‌పూర్

సజావుగా సాగుతున్న సర్వే



అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో సర్వే సజావుగా సాగుతుంది. కొందరు స్థానికేతరులు మాత్రం సర్వే కార్యక్రమంలో పాల్గొనడం లేదు. ప్రణాళికబద్ధంగా సిబ్బందిని ఏర్పాటు చేశాం. సకాలంలో సర్వేను పూర్తి చేస్తాం.

– జ్యోతి రెడ్డి, అమీన్‌పూర్, మున్సిపల్ కమిషనర్

ఇంకా 15రోజులు

ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే 100% పూర్తికావడానికి ఇంకా 15రోజులు పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక కుటుంబన్ని సర్వే చేయడానికి సిబ్బందికి 35 నిమిషాల నుంచి 45 నిమిషాలు పట్టడంతో సర్వే వేగవంతం కాలేకపోతుంది. రోజుకు 10 నుంచి 20 కుటుంబాలను మాత్రమే సర్వే చేస్తున్నారు.

మున్సిపల్ వారీగా సర్వే వివరాలు..

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 27,735 కుటుంబాలను సర్వేకు అంచనా వేశారు. ఇప్పటివరకు 9,100 కుటుంబాలను సర్వే చేశారు. 190 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించడం జరిగింది. ఇందుకు 90 మంది ఎన్యుమరేటర్లు, 18మంది సూపర్‌వైజర్లు నియోగించారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో 52,533 కుటుంబాలను సర్వేకు అంచనా వేశారు. ఇప్పటివరకు 14వేల కుటుంబాలను సర్వే చేశారు. 369 మంది ఎన్యుమరేటర్లు, 31 మంది సూపర్‌వైజర్‌లు ఇక్కడ ఉన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో 18,344 కుటుంబాలను సర్వేకు అంచనా వేశారు. ఇప్పటి వరకు 5,286 మందిని సర్వే చేశారు. 122 ఎన్యుమరేషన్ బ్లాక్‌లుగా విభజించారు.122మంది ఎన్యుమరేటర్లు, 12 మంది సూపర్‌వైజరులున్నారు.

అవసరమైనచోట అదనపు నీటి కనెక్షన్లు



అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ

- మంత్రి దామోదర రాజనర్సింహ
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష

సంగారెడ్డి జోన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థలకు వెంటనే నీటి కనెక్షన్లు ఇవ్వాలని విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైన చోట అదనపు కనెక్షన్లు ఇవ్వాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలో ఆర్‌డబ్ల్యూఎస్ (రూరల్ వాటర్ సప్లై)ఇంజనీర్లతో మంత్రి దామోదర శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ...జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుని, వాటి ఆధారంగా పనులు చేపట్టాలన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థలో ప్రస్తుతం ఉన్న వాటర్ కనెక్షన్లు సరిపోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిషన్ భగీరథ పనితీరుపై మంత్రి ఆరా తీశారు. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్, వాటర్ సప్లైకు సంబంధించి మరమ్మతును, ఎప్పటికప్పుడు చేయించాలన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు సంబంధించిన బిల్లుల సమస్యను అధికారులు మంత్రి దృష్టికి రావడంతో కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బిల్లులు విడుదల చేయాలని సూచించారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను ప్రతీ నెల చెల్లించాలని, వారిని ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరులో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పరిశీలనకు వస్తానని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, ఎస్‌ఈ రఘువీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(ఈఈ) విజయలక్ష్మి, నాగభూషణం, సంపత్, పాషా, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్



పటాన్‌చెరుటౌన్: సంగారెడ్డిలో జనవరి 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ... నాలుగు రోజులపాటు జరిగే ఈ సభల్లో తెలంగాణ రాజకీయాలు, ప్రజల సమస్యలు, భవిష్యత్తు పోరాటాల గురించి చర్చిస్తామన్నారు. సీపీఎం ప్రజల కోసం పోరాడుతున్న పార్టీ అని వివరించా రు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు దాతలు విరాళాలు అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య, పటాన్‌చెరు ఏరియా కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, శేషగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితా విడుదల

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ, పీఈటీ పోస్టులకు సంబంధించి 1:1 మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాలోని అభ్యర్థుల వివరాలు జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్ sangareddy.telangana.gov.in లో పొందుపరిచినట్లు ఆయన వెల్లడించారు. మెరిట్ జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు సంగారెడ్డి కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలతో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో గురునానక్ జయంతి వేడుకలు



గురునానక్ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి పట్టణంలో సిక్కులు భక్తి శ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. శనివారం సిక్కు మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలో బైక్ ర్యాలీతోపాటు ప్రధాన రహదారిగుండా శోభాయాత్ర నిర్వహించారు. వివిధ గురుద్వారాల నిషాన్ సాహెబ్‌లతో గురువులు నడుస్తుండగా సిక్కులు ముందుకు సాగారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా భాగస్వాములయ్యారు. యువత చేసిన కత్తి విన్యాసాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

- సంగారెడ్డి జోన్

హరిద్రకు హారతి



నాచగిరి పుణ్యక్షేత్రం.. హరిద్రనది తీరంలో గంగమ్మ తల్లికి కుంభ హారతి ఇచ్చారు. మహిళలు, భరతనాట్య బృందం కూడా హారతి పట్టింది. దీపాలు వెలిగించి నదిలో వదిలారు. నేత్రపర్వంగా సాగిన కార్తీక దీపోత్సవ వేడుకలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం క్షేత్రంలో భారీగా సత్యనారాయణ వ్రతాలు జరిగాయి.

- వర్గల్(గజ్వేల్)

క్లుప్తంగా

అండర్-19కు గీతం విద్యార్థి ఎంపిక

ధనుష్ ప్రతిభపై ప్రశంసలు


విద్యార్థి ధనుష్

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి దేవి ధనుష్ కూచ్ బెహార్ ట్రోఫీ 2024-25 సీజన్ అండర్-19 ఆంధ్ర రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. దేవి ధనుష్, ప్రతిభావంతుడైన కుడి చేతివాటం బ్యాట్స్‌మన్. దాదాపు తొమ్మిదేళ్లుగా తన క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రఖ్యాత ఎం.ఎస్.కే. ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ధనుష్ అంకితభావం, కృషి ఫలించి, రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇటీవలి అండర్-19 జిల్లా మ్యాచ్‌లలో అసాధారణమైన ప్రతిభను కనబరిచి, కృష్ణాజిల్లా తరఫున అత్యధిక పరుగులు చేశాడు. గీతం విశ్వవిద్యాలయం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ గస్టో-2023-24లో ఉత్తమ బ్యాట్స్ మెన్ అవార్డును పొందాడు. అండర్-14 రాష్ట్ర స్థాయి ప్రాబబుల్స్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేసి, అండర్-16 జోనల్ మ్యాచ్‌లకు చేరుకోవడం, క్రీడలో ధనుష్ సామర్థ్యాన్ని మరింత పెంచింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు ప్రశంసించింది. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ తదితరులు, ధనుష్ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలను నివారించలేరా..?

ఏబీవీపీ నేత పృథ్వీ

చేగుంట(తూప్రాన్): ప్రభుత్వాలు మారుతున్నా బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్యలు నివారించలేక పోతున్నాయని ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీ అన్నారు. శనివారం బాసరకు రైలులో వెళుతున్న ఏబీవీపీ రాష్ట్ర నాయకులను పోలీసులు వడియారం రైల్వే స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పృథ్వీ విలేకరులతో మాట్లాడుతూ ఏడాది కాలంలో 9మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల ఆత్మహత్యలు నివారించడంలో విఫలమైనట్లు తెలిపారు. ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీకి వెళ్లిన నిర్మల్ ఏబీవీపీ కార్యదర్శి సాయిని తలపై గాయపర్చిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. పోలీసులు ముందస్తు అరెస్టు చేసిన వారిలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్, చేగుంట పట్టణ అధ్యక్షుడు వంశీ ఉన్నారు.

ముగ్గురు బైండోవర్

కోహెడరూరల్(హుస్నాబాద్): దుర్గామాత నవరాత్రి ఉత్సవాలలో అనుమతి లేకుండా డీజేలు పెట్టిన శనిగరానికి చెందిన రమేశ్, రాజు అనిల్‌లను ఎస్‌ఐ అభిలాష్, తహసీల్దార్ సురేఖ ఎదుట ఆదివానం బైండోవర్ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఈ ముగ్గురు అధికారుల ఉత్తర్వులు దిక్కరించి డీజేలు పెట్టి ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. వారిపై కేసు నమోదుచేసి బైండోవర్ చేయగా తహసీల్దార్ ఒక్కొక్కరికి రూ.6వేలు జరిమానా విధించారని చెప్పారు.

సుఖ దుఃఖాల సోపతి!

కనుమరుగవుతున్న తోలు డప్పులు

- ఒకప్పుడు రాజ్యమేలిన వాయిద్యం
- ఏ కార్యక్రమమైనా చాటింపు ఉండాల్సిందే
- వాటి స్థానంలో నేడు ప్లాస్టిక్ డప్పులు
- పెరిగిన డీజే మైక్ సెట్‌లు
- ఉపాధి కోల్పోతున్న కులవృత్తి వారు
- కళను బతికించుకోవాలంటున్న డప్పు కళాకారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి


దప్పులు కొడుతున్న యువకులు

పాశ్చాత్య సాంస్కృతికి ప్రతి ఒక్కరూ అలవాటు పడుతున్న ప్రస్తుత తరుణంలో జంతువుల తోలు చర్మంతో తయారు చేసిన డప్పులు కానరాకుండా పోయాయి. వాటి స్థానంలో ప్లాస్టిక్ డప్పులు వచ్చి చేరుతున్నాయి. దీంతో సహజ శబ్దాలను పలికే చర్మాలతో తయారు చేసే వారు సైతం కనుమరుగైపోతున్నారు. నాడు గ్రామాల్లో సందర్భాన్ని బట్టి కొట్టే డప్పు శబ్దాలు పలానా పండుగనీ, పెండ్లి తంతనీ, లేదా అంతిమ యాత్ర అని జనాలు గుర్తు పెట్టుకునే వారు. ప్రస్తుతం ప్లాస్టిక్‌తో చేసిన డప్పులు రంగప్రవేశం చేయడంతో తోలు డప్పుల ద్వారా వచ్చే లయబద్ధమైన శబ్దాలు వినిపించడం లేదని డప్పు కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక):

మారుమూల

పల్లెల్లో ఆదరణ లేక మూగబోయిన డప్పు దరువును అందె మ్యూజిక్ అకాడమీ సంస్థ డప్పు ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెబుతోంది. అకాడమీ వ్యవస్థాపక చైర్మన్ అందె భాస్కర్ తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి శిక్షణ ఇచ్చి డప్పు కళాకారులను తయారు చేశారు. దేశ స్వాతంత్ర్య చరిత్రలో గత జనవరి 26న మొదటి సారిగా భారత రిపబ్లిక్ పరేడ్‌కు డప్పుకు ఆహ్వానం లభించింది. సౌత్

ప్రపంచానికి చాటిన 'అందె'దరువు


ఆఫ్రికాతోపాటు ఇటీవల మలేషియాలో సైతం డప్పుల మోత మోగించి ప్రపంచానికి చాటి చెప్పారు. డప్పు దరువు పై పరిశోధన చేసి డప్పు ధ్వని విలువను ప్రపంచానికి పరిచయం చేసిన అకాడమీ చైర్మన్ అందె భాస్కర్‌కు భారత సంగీత నాటక అకాడమీ, మినిస్ట్రీ కల్చర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియా వారు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కారాన్ని అందించారు. యువ పురస్కారం అందుకున్న అందె భాస్కర్‌ను ఇటీవల తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సన్మానించి సత్కరించడం విశేషం.

కనుమరుగవుతున్న లందలు

డప్పుల తయారీలో కీలకంగా మారే లందలు (ప్రత్యేకమైన గోళాలు) క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఈ లందల్లో జంతు చర్మాలను నానబెట్టి చర్మాలకు ఉన్న వెంట్రుకలను తొలగించడం కీలకంగా మారుతుంది. లందలు ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో ఉన్న అన్ని కుల వర్గాల ప్రజలు తమ ఇళ్లల్లో కుల దేవతలను ప్రతిష్ఠించడానికి ముందుగా లందలకు ప్రత్యేక పూజలు చేయడం విశేషం.



సౌతాఫ్రికా స్టేజీపై డప్పు కళాకారులు



డప్పు తయారీ కోసం జంతు చర్మాలను నానబెట్టే లంద (ప్రత్యేకమైన గోళం)

డప్పుల తయారీ ఇలా..

డప్పులు కొట్టడం మాదిగల కుల వృత్తి. వీరు డప్పులు తయారు చేయడంలో కూడా నేర్పరులు. వీరు లేత మేకలు, గొర్రెలు, వయస్సు తక్కువ ఉన్న దూడల నుంచి లభించే లేత చర్మాలతో డప్పులను తయారు చేస్తారు. చలి కాలంలో తోలు డప్పులు ముడుచుకు పోవడంతో శబ్దం పలకడం కష్టతరంగా మారుతోంది. ఇలాంటి సమయంలో డప్పు వాయిద్యకారులు డప్పులను సన్నని సెగపై కాపడం వల్ల డప్పులు కంచు మోగినట్లు మోగుతాయి. డప్పులను తయారు చేసిన వారికి, వాటిని వినియోగించిన వారికి ఉపాధి లభిస్తుండేది.


తోలు డప్పులను కాపుతున్న యువకులు

డీజేల సౌండ్‌లతో..

డీజేల సౌండ్ రాకతో డప్పుల చప్పుడు మూగబోయాయి. వినాయక చవితి, దుర్గామాతల శోభా యాత్రలు, రాజకీయ నాయకుల విజయ యాత్రల్లో కీలకంగా మారిన డప్పులు ఇప్పుడు డీజేల సౌండ్ల రాకతో కనిపించకుండా పోయాయి. డీజే రణగొన ధ్వనుల మధ్య చిన్నారుల నుంచి పెద్దల వరకు నృత్యాలు చేస్తూ సందడి చేసే పరిస్థితులు నెలకొన్నాయి.


ఢిల్లీలో డప్పు ప్రదర్శనలు

చర్మాలతో తయారు చేసేవాడిని



గొర్రెలు, మేకల చర్మం కంటే లేత దూడల చర్మం (తోలు)తో చేసిన డప్పులు బాగా మోగేవి. ఏదో కారణంగా చనిపోయిన లేత దూడల చర్మాలను తీసుకొచ్చి డప్పును తయారు చేసెటోన్ని. డప్పులు తయారు చేసినందుకు నాకు ఇంత గిట్టు బాటు దొరికేది. ఇప్పుడు తోలు డప్పులు కానరాకుండా పోయినయ్. వాటి స్థానంలో ప్లాస్టిక్ డప్పులు వచ్చాయి. తోలు డప్పులను తయారు చేసే వారు కూడా మా తరంతోనే పోయెటట్టుంది.

– మల్లయ్య, మిరుదొడ్డి

డప్పును వాయిస్తాను



ఒకప్పుడు కేవలం మగవారే డప్పులు వాయించే వారు. నేను సైతం డప్పును వాయిస్తాను. డప్పు మీద ఉన్న మమకారంతో నాతోపాటు చాలా మంది మహిళలు డప్పు వాయిద్యాన్ని నేర్చుకున్నారు. ఢిల్లీ ఎర్రకోటలోనే కాకుండా సౌతాఫ్రికా ఖండంలో కూడా డప్పు దరువును మోగించాం. పల్లెల్లో చిన్నబోయిన డప్పు వాయిద్యాన్ని ఖండాంతరాలు దాటించడంలో నా వంతు కృషి చేయడం ఆనందంగా ఉంది.

– దివ్య, డప్పు కళాకారిణి, సిద్దిపేట

ఉపాధి కరువైంది



మా తాత ముత్తాలు డప్పులు కొడుతుండేవారు. వారితోపాటు నేను కూడా డప్పులు బాగా కొడతాను. నాడు రాజకీయ సభలకు, దేవీ దేవతల కల్యాణ మహోత్సవాలతోపాటు, ఎక్కడైనా పెండ్లీలు జరిగితే వారం రోజుల పాటు ఉపాధి లభించేది. ఇప్పుడు డీజేలు, బ్యాండ్ మేళాలు రావడంతో డప్పులకు ఆదరణ తగ్గి పోయింది. దీంతో మాకు ఉపాధి లేకుండా పోయింది.

– భూమరాజయ్య, మిరుదొడ్డి

కళాకారులను ఆదుకోవాలి



ఒక నాడు పల్లెల్లో డప్పులు వాయిస్తూ ఉపాధి పొందే వారు ఇప్పుడు ఆదరణ లేక డప్పుల శబ్దాలు వినిపించడం లేదు. దీంతో డప్పులను తయారు చేసే వారు కూడా కనుమరుగవుతున్నారు. డప్పు కళాకారులను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి పింఛన్ లాంటి సౌర్యం కల్పించాలి. స్వయం ఉపాధి కలిగించేలా ప్రభుత్వం పాటు పడాలని కోరుతూ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించాం.

– అందె భాస్కర్, మిరుదొడ్డి

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- మృతులు హైదరాబాద్ వాసులు


ప్రమాదానికి గురైన కారు

 
శివకుమార్, చికిత్స పొందుతున్న మనోజ్

జహీరాబాద్ టౌన్: దైవ దర్శనానికి వెళ్లి వస్తున్న సమయంలో భక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. 65వ జాతీయ రహదారిపై జహీరాబాద్ బైపాస్ రోడ్డులో కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు ఈ ఘంటన చోటు చేసుకుంది. వీరంతా హైదరాబాద్‌కు చెందిన వారు. జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ. కాశీనాథ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన సురేష్, శివకుమార్, నర్సింహరావు అతని కుమారుడు మనోజ్‌లు కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని కర్నాటక రాష్ట్రంలోని ఘనగాపూర్‌లో గల శ్రీదత్తాత్రేయస్వామిని దర్శించుకునేందుకు శుక్రవారం టీఎస్08 హెచ్‌ఎం0220 నంబర్ గల ఆల్టో కారులో వెళ్లారు. ఘనగాపూర్‌లో స్వామి వారిని దర్శించుకుని తిరిగి వస్తున్న సమయంలో డ్రైవర్‌కు నిద్రమత్తు రావడంతో కారుపై నియంత్రణ కోల్పోయాడు. 65 జాతీయ రహదారిపై పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఇంద్రప్రస్తా కాలనీ వద్ద వేగంగా వెళ్లి కారు కల్వర్టుకు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సురేష్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటినా గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జహీరాబాద్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా నర్సింహరావు(42) మృతి చెందారు. శివకుమార్, మనోజ్‌లకు తీవ్రగాయాలు కావడంతో స్థానికంగా చికిత్స అందించిన తరువాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెడు వ్యసనాలు.. ముగ్గురు విద్యార్థులు అదృశ్యం

  
మనోజ్ కుమార్ అఖిల్ మల్లికార్జున్

జిన్నారం (పటాన్‌చెరు): చెడు వ్యసనాలకు బానిసలైన ముగ్గురు విద్యార్థులు అదృశ్యమయ్యారు. ఈ సంఘటన శనివారం బొల్లారంలో చోటుచేసుకుంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మనోజ్ కుమార్, అఖిల్, మల్లికార్జున్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పాఠశాల గోడదూకి పారిపోయారు. ఈనెల 14వ తేదీన పాఠశాలలో బాలల దినోత్సవం జరుగుతున్న సందర్భంలో వీరు భవనం పైకి వెళ్లి సిగరెట్లు తాగారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి మందలించి వదిలేశారు. మరుసటి రోజు తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి సరిగ్గా ఒంటిగంట సమయంలో ముగ్గురు విద్యార్థులు పాఠశాల గోడ దూకి పారిపోయారు. వెంటనే ప్రిన్సిపాల్ సీఐ గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. ఇద్దరు కలిసి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చెడు వ్యసనాలకు బానిసలైన విద్యార్థులపై తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాల్సిన బాధ్యత ఉందన్నారు. పారిపోయిన విద్యార్థులు ఎవరికైనా కనబడితే 8712656729, 8712661841 నంబర్లకు ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

హైవేపై దూసుకొచ్చిన మృత్యువు

- రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొన్న కారు
- అక్కడికక్కడే మృతి


సత్యమ్మ(ఫైల్)

టేక్మాల్(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి వద్ద 161 సంగారెడ్డి-నాందెడ్ అకోలా రహదారిపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. బొడ్మట్‌పల్లికి చెందిన భవానీ సత్యమ్మ(35) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఎప్పటిలాగే కూలి పనులకు వెళ్లి పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా రోడ్డు దాటుతోంది. ఇదే సమయంలో సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వెళుతున్న గుర్తు తెలియని కారు వేగంతో వచ్చి సత్యమ్మను బలంగా ఢీకొట్టింది. సత్యమ్మకు తలకు, ముక్కుకు బలంగా గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గ్రామస్తుల ధర్నా

161హైవే అధికారులు రోడ్డుపై విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని గ్రామస్తులు ధర్నా చేశారు. హైవే అధికారులు విద్యుత్ బల్బులు, అండర్‌పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని చెబుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అల్లాదుర్గం సీఐ రేణుక హైవే అధికారులతో మాట్లాడి బల్బులు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

సిద్దిపేటరూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన నారాయణరావుపేట మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ అపూర్వరెడ్డి వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కొమిరే కళవ్వ (51) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తుంది. భర్త చనిపోవడంతో కుటుంబ పోషణతో పాటుగా ఇటీవల కొడుకుకు పెళ్లి చేసి అప్పుల పాలైంది. కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన కళవ్వ శుక్రవారం రాత్రి ఇంట్లో వారికి చెప్పకుండా బయటికి వెళ్లింది. రాత్రి 9 అయినప్పటికి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకి కోసం గాలించగా.. ఇంటికి సమీపంలో ఉన్న బావి వద్ద చెప్పులు కనిపించడంతో బావిలో చూడగా.. అప్పటికే కళవ్వ బావిలో తేలాడుతుంది. కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాక్టర్ పైనుంచి పడి రైతు మృతి

ధాన్యం అమ్ముకొని వస్తుండగా ప్రమాదం

పెద్దశంకరంపేట(మెదక్): ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని శివాయిపల్లి వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ముసాపేటకు చెందిన కుర్మగొల్ల బీరప్ప(43) స్నేహితుడు దేవయ్య, ట్రాక్టర్ డ్రైవర్ గోసాయిపల్లి వీరయ్యతో కలిసి ధాన్యాన్ని అమ్ముకునేందుకు శుక్రవారం ఉత్తులూర్ వద్ద ఉన్న రైస్‌మిల్లుకు వెళ్లారు. తిరిగి వస్తుండగా ట్రాక్టర్‌పై నుంచి కింద పడడంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, డ్రైవర్ మద్యం మత్తులో ఉండి అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో పట్టుతప్పి పడిపోయాడని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి కథనం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని మహదేవ మొబైల్ షాప్ పక్కన ఖాళీ స్థలంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. అతని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి సంబంధించిన బంధువులు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పటాన్‌చెరు పోలీసులు చెప్పారు.

ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలి

విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు


ఎల్లాపూర్ మిల్లును తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణా చార్యులు

పాపన్నపేట(మెదక్): రైసు మిల్లులకు వచ్చే ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ ద్రోణాచార్యులు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎల్లాపూర్ రైసు మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చే ధాన్యాన్ని వెంటనే దింపుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాల్సిన బాధ్యత మిల్లు యజమానులదేనని చెప్పారు. లారీలు సకాలంలో ఖాళీ చేసుకోక పోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అక్రమాలు బయటపెడుతున్నారనే..


- హత్యాయత్నం కేసులో ఆరుగురు నిందితుల రిమాండ్
- గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి వెల్లడి


తొగుట(దుబ్బాక): మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన పిట్ల రాజు (30)పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను శనివారం ఆరుగురు నిందితులను అరెస్టు చేశామని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామం లక్ష్మీపూర్‌కు చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు పిట్ల శ్రీనివాస్, మల్‌చెల్మ స్వామిల మధ్య నెలకొన్న తగాదా హత్యాయత్నానికి దారితీసిందన్నారు. మాజీ సర్పంచ్ స్వామి, మాజీ వార్డు సభ్యుడు కనకరాజు మల్లన్న సాగర్‌లో భూసేకరణ సమయంలో అక్రమాలకు పాల్పడ్డారని, అలాగే గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో దేవాలయ నిర్మాణంలో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ పిట్ల రాజు తరచూగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఈ క్రమంలో అక్రమాలను ప్రశ్నిస్తున్న రాజును ఎలాగైనా అడ్డు తొలగించాలని మాజీ సర్పంచ్ స్వామి, ఆయన తమ్ముడు కరుణాకర్, మాజీ వార్డు సభ్యుడు కనకరాజు కుట్రపన్నారని తెలిపారు. ఇందులో భాగంగా రాజును హత్య చేయించేందుకు రూ.50వేలకు తుక్కాపూర్‌కు చెందిన గండ్యాల నగేష్ అలియాస్ డాన్‌తో ఒప్పందం చేసుకున్నారు. కాగా నగేష్ రాంపురానికి చెందిన జె.భిక్షపతితో రాజును హత్య విషయమై చర్చించారు. ఈ నెల 10న సాయంత్రం తొగుట వైన్స్ సమీపంలో వీరు మద్యం తాగించి రాజును హత్య చేసేందుకు పథకం రచించారు. దీంతో కడారి సాగర్, మల్లుగారి గణేష్, ఎండీ ఫిరోజ్‌తో పాటు ఇద్దరు మైనర్లు 11వ తేదీన సాయంత్రం రాజు వ్యవసాయ బావి వద్ద ఉన్న సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై వెళ్లి బీరు సీసాలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో రాజు తీవ్ర గాయాలతో స్పృహతప్పి పడిపోయాడు. రాజు మరణించాడని నిర్ధారించుకున్న తర్వాత అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రాజును చికిత్స కోసం కుటుంబీకులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు తండ్రి పిట్ల శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏసీపీ తెలిపారు. కాగా ఈ దాడిలో పాల్గొన్న ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. మాజీ సర్పంచ్ కొల్చెల్మ స్వామి, అతని తమ్ముడు కరుణాకర్, కనకరాజు, భిక్షపతి పరారీలో ఉన్నారని తెలిపారు.

మల్లన్న మన్నించు

స్వామివారి పుష్కరిణి చుట్టూ మురుగు

మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రైవేటు అద్దె గదులు, దుకాణాల సముదాయాల నుంచి వచ్చే డ్రైనేజీ పైపులు పగిలి స్వామి పుష్కరిణి (ధర్మగుండం) చుట్టూ మురుగు నీరు పేరుకుపోయింది. నిత్యం వేలాది మంది భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తారు. వారు పుష్కరిణిలో పుణ్య స్నానం చేసి ఈ మురుగు నీటిలో నుంచే నడిచి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


స్వామి వారి పుష్కరిణి చుట్టూ మురుగు


మురుగులో నుంచి నడుస్తున్న భక్తులు

– కొమురవెల్లి(సిద్దిపేట):